సాక్షి చిత్తూరు

శుక్రవారం । 22 । మార్చి । 2024



కోడ్ బేఖాతర్

కోడ్ అమల్లో ఉన్నా ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. రహదారిపై పట్టపగలే తరలించేస్తున్నారు. - IIలో



పీఈఎస్‌లో అరుదైన చికిత్స

కుప్పం పీఈఎస్‌లో మహిళకు అరుదైన కీ హోల్ శస్త్ర చికిత్స నిర్వహించినట్లు వైద్యులు మీడియాకు వివరించారు. - IIలో

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ శుక్రవారం (సా)	సహర్ శనివారం (ఉ)
చిత్తూరు	6.29	4.55
పుంగనూరు	6.31	4.59

న్యూస్‌రీల్

చిన్నారులకు భరోసా



అవగాహన కార్యక్రమంలో అధికారులు

చిత్తూరు రూరల్: బాల భవిత కేంద్రం చిన్నారులకు ఆరోగ్య భరోసా కల్పిస్తోందని డీఎంహెచ్‌ఓ ప్రభావతిదేవి అన్నారు. చిత్తూరు నగరం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలోని జిల్లా బాలల భవిత కేంద్రంలో గురువారం డౌన్ సిండ్రోమిక్ డేను నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ జన్యుపరమైన లోపాల కారణంగా పుట్టుకతోనే పిల్లలకు పెదవి చీలిక ఏర్పడుతుందన్నారు. దీనికి బాల భవిత కేంద్రంలో మెరుగైన వైద్యం అందిస్తారని చెప్పారు. ప్రభుత్వ సాయంతో పెదవి చీలికకు శస్త్ర చికిత్స చేస్తారన్నారు. ఈ అవకాశాన్ని పిల్లలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో అధికారులు శిరీష, దుర్గాప్రసాద్, శబరీష్, శ్రీవాణి తదితరులు పాల్గొన్నారు.

రశీదులపై ఓటరు చైతన్య నినాదాలు

చిత్తూరు అర్బన్: ఓటు హక్కు వినియోగంపై నగరపాలక సంస్థ వినూత్న పంథాలో అవగాహన కల్పిస్తోంది. ఇప్పటికే సెల్ఫీ పాయింట్లతో యువ ఓటర్లకు, రంగవల్లులతో మహిళలకు ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. తాజాగా నగరపాలక సంస్థ జారీ చేసే వివిధ రకాల రసీదుల్లోనూ ఓటు హక్కుపై అవగాహన కల్పించే దిశగా చర్యలు చేపట్టారు. స్వీప్ కార్యక్రమాల్లో భాగంగా ఏఆర్వో, కమిషనర్ అరుణ ఆధ్వర్యంలో నగరపాలక సంస్థలో వినూత్నంగా ఓటు హక్కు వినియోగంపై నగరవాసులకు అవగాహన కల్పిస్తున్నారు. ఇందులో భాగంగా వివిధ రకాల పన్నులు చెల్లించే వారికి నగరపాలక సంస్థ రసీదులు అందిస్తున్నారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఓటు హక్కుపై నగరవాసులకు చైతన్యం కలిగించే దిశగా ఈ రసీదులపై నినాదాలు ముద్రిస్తున్నారు. వార్డు సచివాలయాల ద్వారా జారీ చేసే వివిధ రసీదుల్లోనూ ఓటరు చైతన్య నినాదాలు ముద్రించి పంపిణీ చేస్తున్నారు. తద్వారా పౌరులు ఓటు హక్కు వినియోగించుకునేలా అవగాహన కల్పిస్తున్నారు.


వరసిద్ధుని సేవలో ప్రిన్సిపల్ సెక్రటరీ



ఆలయంలో ప్రిన్సిపల్ సెక్రటరీ కుటుంబ సభ్యులు

కాణిపాకం: కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీ, ఎలక్షన్ కమిషనర్ కె.ఆర్.బి.హెచ్.ఎన్ చక్రవర్తి దర్శించుకున్నారు. ఆయన గురువారం కుటుంబ సమేతంగా కాణిపాకం విచ్చేయగా ఆలయ ఈఓ వెంకటేశు స్వాగతం పలికి స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం ఆశీర్వాద మండపంలో వేదపండితులచే ఆశీర్వచనం అందించి స్వామివారి వస్త్రం, తీర్థ ప్రసాదాలు, చిత్రపటం అందించారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు డీపీఓ లక్ష్మి, ఐఅండ్‌పీఆర్‌ఓ డీడీ పద్మజ, ఆలయ ఏఈఓ విద్యాసాగర్ రెడ్డి, సూపరింటెండెంట్ కోదండపాణి, ఐరాల తహసీల్దార్, ఆలయ ఇన్‌స్పెక్టర్ విగ్నేష్, రెవిన్యూ అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్ర విభజన తరువాత రాజధాని అమరావతి పేరుతో చంద్రబాబు అండ్ కో భారీ దోపిడీకి తెరలేపారు. ఉత్తుత్తి డిజైన్లు, భారీ గ్రాఫిక్స్‌లతో రాజధాని నమూనాను చూపించి, జనాన్ని బోల్తా కొట్టించారు. పేద రాష్ట్రం అంటూ ప్రకటనలు గుప్పించి, 'నా ఇటుక- నా అమరావతి' పేరుతో చందాల వసూళ్లకు శ్రీకారం చుట్టారు. అందుకోసం కొత్త వెబ్‌సైట్ రూపొందించారు. ఆ వెబ్‌సైట్ ద్వారా తీసుకున్న చందాలకు, విరాళాలకు రశీదులు కూడా ఇవ్వలేదు. బాబు గారడీని గుడ్డిగా నమ్మిన జనం భారీగా చందాలు సమర్పించేశారు. విరాళమిచ్చిన వారికి కేంద్ర ప్రభుత్వం నుంచి ఆదాయపు పన్ను రాయితీ ఉంటుందని నమ్మించి నట్టేట ముంచేశారు. తీరా ఆ నిధి ఏమైందో.. విరాళాల మొత్తం ఎక్కడుందో తెలియక జనాలు తల పట్టుకుంటున్నారు. జిమ్మిక్కుల బాబు మాటలు విని మోసపోయామని ప్రజలు శాపనార్థాలు పెడుతున్నారు.



మేడ కట్టనిధి!

- నా ఇటుక- నా అమరావతి పేరిట చందాల వసూలు
- విరాళాలిచ్చిన వారికి ఆన్‌లైన్‌లో రశీదులిస్తామని చెప్పిన వైనం
- రాజధాని నిర్మాణం పేరిట ఇదో స్కామ్ అంటున్న జనం

పలమనేరు: రాష్ట్ర విభజన తరువాత అమరావతిలో అద్భుతంగా సింగపూర్‌ను తలదన్నేలా కొత్త రాజధానిని నిర్మిస్తామని అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు చేసిన హంగామా అంతా ఇంతా కాదు. భారీ డిజైన్లతో కంప్యూటర్ల ద్వారా రాజధాని ఇలా ఉంటుంది, అలా ఉంటుందంటూ ప్రింట్‌లను తీసి భారీగా ప్రచారం చేసిన విషయం తెలిసిందే. ఈ ఉత్తుత్తి డిజైన్లను చూసిన జనం గుడ్డిగా నమ్మారు. అయితే ఇదంతా బాబు అండ్ కో సాగించిన రియల్ ఎస్టేట్ వ్యాపారమని అప్పట్లో తెలుసుకోలేకపోయారు. దీనికి తోడు రాజధాని నిర్మాణాలకు ప్రజలనుంచి ఎన్‌ఆర్‌ఐల దాకా 'నా ఇటుక- నా అమరావతి' పేరిట వెబ్‌సైట్‌ను తెరిచి కొత్త స్కామ్‌కు నాంది పలికారు. మన రాజధాని కదా అనే ప్రేమతో ఉమ్మడి చిత్తూరు జిల్లా నుంచి ఎందరో చందాలకోసం నగదును ఆన్‌లైన్ ద్వారా లక్షలాది రూపాయలు విరాళంగా అందించారు. అయితే ఇటుకలు పోతేపోనీ ఆ డబ్బు ఏమైందన్న ప్రశ్న జనం నుంచి వినిపిస్తోంది.

రాజధానికి ఆర్థిక సాయం పేరిట దోపిడీ

అమరావతి రాజధాని నిర్మాణం పేరిట అప్పటి పాలకులు 2015 అక్టోబరు 15న 'నా ఇటుక- నా అమరావతి' పేరిట ఈ- ఇటుక (ఈ-బ్రిక్) కార్యక్రమాన్ని అట్టహాసంగా ప్రారంభించారు. ఈ నిధిలో ఎవరైనా ఆర్థిక సాయం చేయచ్చునంటూ ప్రచారం చేశారు. ఒక్కో ఇటుక (రూ.10) నుంచి కోటి వరకూ ఆర్థిక సాయం చేయవచ్చని, దీన్ని రాజధాని నిర్మాణ నిధిలో ఉంచుతామంటూ ప్రకటనలిచ్చుకున్నారు. ఇందుకోసం జరిగే లావాదేవీలపై www.amaravathi.gov.in అనే వెబ్‌సైట్‌ను రూపొందించారు. ఇందులో నగదును మీ సేవల ద్వారా, పోస్టాఫీసులు, మనీ ఆర్డర్, డీడీ, ఆన్‌లైన్, డెబిట్, క్రెడిట్ కార్డుల ద్వారా పంపాలని సూచించారు. నగదు పంపిన వారు అదే సైట్‌లో విరాళ రశీదులను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని సూచించారు. ముఖ్యంగా ఆదాయపు పన్ను మినహాయింపులుంటాయంటూ నమ్మబలికారు. చాలా మందికి ఇది వర్తించకపోవడంతో కేంద్ర ప్రభుత్వం నుంచి ఆదేశాలు త్వరలోనే వచ్చేస్తాయంటూ నమ్మించారు. ఏదేమైనా ఉమ్మడి జిల్లాలో వేలాదిమంది లక్షలాది రూపాయలను రాజధాని నిర్మాణానికి చెల్లించారు.

ఇప్పుడు ఆ నిధి ఏమైనట్లో

ఈ విధంగా ఉమ్మడి చిత్తూరు జిల్లా నుంచే కాకుండా ప్రపంచంలో ఉండే తెలుగువారినుంచి భారీగా విరాళాలను సేకరించారు. అయితే అప్పుడు చెల్లించిన విరాళాలు ఏమయ్యాయో, ఎక్కడికెళ్లాయో నాటి పాలకులకే తెలియాలంటున్నారు సాధారణ జనం. రాజధాని పేరిట గ్రాఫిక్స్ చూపెట్టి ప్రజలను మోసం చేసిందే కాకుండా జనం నుంచి ఈ- ఇటుకల పేరిట జరిగిన దోచుకున్న తీరును తలచుకొని ఇప్పటికీ శాపనార్థాలు పెడుతున్నారు.

ఇటుకల డబ్బు ఏమైంది?



"చంద్రబాబు చెప్పినట్టు అమరావతిలో భారీ భవనాలు లేవు. కనీసం టీకొట్లు, మంచి హోటల్ కూడా లేదు. అక్కడున్నవన్నీ తాత్కాలిక భవనాలే. రాజధానిలోకి వెళ్లేందుకు సరిగ్గా రోడ్డు కూడా లేదు. సింగపూర్‌ను మించిన రాజధాని అన్నారు. ఎలాగు వర్షానికి ఇటుకలు కరిగిపోయినా వసూలు చేసిన డబ్బు ఏమైందో చంద్రబాబు జనానికి చెప్పాలి.

– సుబ్రమణ్యం రెడ్డి, రైతు, కల్లాడు, పలమనేరు మండలం

ఆ విషయాన్ని అడిగేవారెవరు?



ఈ ఇటుక కోసం నాటి పాలకులు సేకరించిన ప్రజాధనం ఏమైందో అడిగేవాళ్లెవరు. ఆ నిధికి ఎంత మొత్తం వచ్చింది. దాన్ని ఎక్కడ ఉంచారో చెప్పాల్సిన బాధ్యత అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబుదే. ఆయన మాట నమ్మి నాడు డబ్బులు కట్టిన వారంతా ఇప్పుడు బాధపడుతున్నారు. ఇప్పుడా వెబ్‌సైట్ ఓపెన్ కావడమే లేదంటున్నారు కొందరు. అసలు ఏం జరిగిందో అప్పటి పాలకులకే తెలియాలి.

– సోమచంద్రారెడ్డి, మేధావుల ఫోరం అధ్యక్షుడు

వైఎస్సార్‌సీపీలో నియామకాలు

చిత్తూరు కార్పొరేషన్: వైఎస్సార్‌సీపీలో మైనారిటీ, యువజన విభాగాల్లో నియామకాలు చేస్తూ గురువారం పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాకు చెందిన షేక్ మొహమ్మద్ అలీని రాష్ట్ర మైనారిటీ విభాగ ప్రధాన కార్యదర్శిగా నియమించారు. యువజన విభాగం మండల స్థాయి అధ్యక్షులను ప్రకటించారు. కుప్పం టౌన్‌కు జతిన్, కుప్పం రూరల్ – దౌలత్‌బాషా, గుడుపల్లె – మురళీ, రామకుప్పం –సీ.ఆర్.మోహన్‌రెడ్డి, శాంతిపురం– వి.జగదీష్‌నాయుడు, పలమనేరు టౌన్– రాజేష్, పలమనేరు రూరల్ – వై.రామచంద్రారెడ్డి, గంగవరం – కిషోర్‌నాయుడు, వి.కోట – బాలాజీ, బైరెడ్డిపల్లె – మహేష్, పెద్దపంజాణి – జి.సుబ్రమణ్యం, పుంగనూరు టౌన్ – ఎస్.హేమంత్, పుంగనూరు రూరల్ – కే.హేమచంద్ర, చౌడేపల్లె – టి.శరణ్‌కుమార్‌రెడ్డి, సోమల – వి.కుమార్‌రాజా, సదుం– పి.వినోద్‌కుమార్, పులిచెర్ల – షేక్‌ఫరూక్, రొంపిచెర్ల – ఐ.మల్లికార్జునరెడ్డి, పూతలపట్టు – పి.నవీన్‌కుమార్, ఐరాల – ఆర్.భార్గవ్‌రెడ్డి, తవణంపల్లె – వై.వి.వంశీకృష్ణ, బంగారుపాళ్యం – జగదీష్, యాదమరి – కార్తీక్, చిత్తూరు టౌన్ – డి.మనోజ్‌రెడ్డి, చిత్తూరు రూరల్ – స్టాండ్లీ, గుడిపాల – ఎస్.సిలంబరసన్, జీడీనెల్లూరుకు గోపి, ఎస్‌ఆర్‌పురం – ఎన్.యుగంధర్‌రెడ్డి, పెనుమూరు – కే.లోకేష్‌రెడ్డి, వెదురుకుప్పం – కే.గోపినాథరెడ్డి, పాలసముద్రం – ఆర్.చంద్ర, కార్వేటినగరం – కే.రాజశేఖర్‌ను నియమించారు.

శ్రీవారి దర్శనానికి 16 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 11 కంపార్ట్‌మెంట్లు నిండాయి. బుధవారం అర్ధరాత్రి వరకు 69,072 మంది స్వామివారిని దర్శించుకోగా 26,239 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.51 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 16 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

అనాథ బాలికల భవితకు బాసట

అనాథ బాలికల భవితకు కేజీబీవీలు బాసటగా నిలుస్తున్నాయి. ప్రస్తుత ప్రభుత్వ హయాంలో ఈ విద్యాలయాలు కార్పొరేట్‌కు దీటుగా అభివృద్ధి చెందాయి. అక్కడ భోజనం నుంచి వసతి వరకు అన్ని సదుపాయాలు అందుబాటులో ఉన్నాయి. ఆరో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు విద్యా ప్రమాణాలు మెరుగ్గా ఉన్నాయి. ప్రతి ఏటా ఈ పాఠశాలల్లో వందలాది మంది బాలికలు ఇంటర్ చదువు పూర్తి చేస్తున్నారు. 2024–25లో కేజీబీవీ పాఠశాలల్లో అడ్మిషన్లకు రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల నోటిఫికేషన్ జారీచేసింది. దీనిపై సాక్షి ప్రత్యేక కథనం.

- కార్పొరేట్‌కు దీటుగా కస్తూర్బా పాఠశాలలు
- ఉచిత వసతి సదుపాయం
- పౌష్టికాహారం, ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా ఉన్న కేజీబీవీలు (కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాలు) కార్పొరేట్ బడులకు దీటుగా అభివృద్ధి చెందాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా గత ఐదేళ్లలో కేజీబీవీల్లో మెరుగైన విద్యాబోధనలు అందిస్తున్నాయి. ఈ పాఠశాలల అభివృద్ధికి ప్రస్తుత సర్కారు కోట్లాది రూపాయలు వెచ్చిస్తోంది. పేద, మధ్య తరగతి బాలికలు చదివే ఈ విద్యాలయాల్లో సకల సౌకర్యాలను కల్పించింది. అంతర్జాతీయ స్థాయి విద్యాప్రమాణాలు, ఇంగ్లీష్ మీడియంలో బోధన చేస్తూ ముందుకు సాగుతోంది. పేదలు, అనాథలు, బడిబయట బాలికలను ఉన్నతంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా కేజీబీవీలు పురుడు పోసుకున్నాయి. ఆరవ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు ఒకే చోట విద్య నభ్యసించే సౌకర్యం ఈ పాఠశాలల్లో ఉంది. ఈ పాఠశాలల్లో చదివిన ఎంతో మంది విద్యార్థినులు జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకున్నారు.



కేజీబీవీ పాఠశాల విద్యార్థినులు

ఎవరెవరు దరఖాస్తు చేసుకోవచ్చంటే..

అనాథ, వీధి బాలికలు, పేద పిల్లలతో పాటు బడి బయట ఉన్న పిల్లలు, బడి మానేసిన వారు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, బీపీఎల్ బాలికలకు తొలి ప్రాధాన్యత కింద కేజీబీవీల్లో ప్రవేశాలు కల్పిస్తారు. వలస కూలీల చిన్నారులు, అసిస్టెంట్ లేబర్ సహాయ శాఖ అధికారులు సిఫారసు చేసిన వారికి ప్రవేశాల్లో ప్రాధాన్యత ఉంటుంది. 6వ తరగతిలో ప్రవేశం కోసం ప్రభుత్వ, గుర్తింపు పొందిన పాఠశాలల్లో 5వ తరగతి చదివిన బాలికలై ఉండాలి. ఏప్రిల్ 11వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవచ్చు. ఆన్‌లైన్ ద్వారా వచ్చిన దరఖాస్తులను మాత్రమే అడ్మిషన్ కోసం పరిగణనలోకి తీసుకుంటారు. విద్యార్థినులు తమ దరఖాస్తును ఏపీకేజీబీవీ.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్ వెబ్‌సైట్‌లో పొందవచ్చు. ఎంపికైన బాలికలకు ఫోన్ ద్వారా సమాచారం అందుతుంది. ఆయా పాఠశాల నోటిఫికేషన్ బోర్డులోనూ ప్రదర్శిస్తారు.

నడవడికపై అవగాహన

బాలికలు సమాజంలో ఎలా నడుచుకోవాలో కేజీబీవీల్లో అవగాహన కల్పిస్తున్నారు. విలువలను పెంపొందించుకునేలా ప్రత్యేకంగా వ్యక్తిత్వ వికాస తరగతులు నిర్వహిస్తున్నారు. అభ్యసన నైపుణ్యాలు పెంచుకునేలా బోధనలు సాగుతున్నాయి. ఇక్కడ విద్యనభ్యసించే బాలికలకు పౌష్టికాహారం అందించి, ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. ఈ క్రమంలోనే జిల్లా వ్యాప్తంగా ఉన్న 8 కేజీబీవీ పాఠశాలల్లో 2024–25 విద్యాసంవత్సరానికి రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల నోటిఫికేషన్ జారీచేసింది. ఏప్రిల్ 11 వతేదీ లోపు అర్హత, ఆసక్తి ఉన్న విద్యార్థినులు కేజీబీవీల్లో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారు.

ఉచిత వసతి, భోజన సదుపాయాలు

నిరుపేద, అనాథ బాలికల చదువుకు కేజీబీవీలకు ఆలవాలంగా మారాయి. అడ్మిషన్లు పొందే ఉచిత వసతి, భోజన సదుపాయం ప్రమాణాలతో కూడిన విద్యను బోధిస్తున్నాయి. బాలికల ఉజ్వల భవితకు బాసటగా నిలుస్తున్నాయి. కేజీబీవీల్లో 2024–25 విద్యా సంవత్సరానికి గాను ఆరో తరగతి, ఇంటర్మీడియట్ ప్రవేశాలకు ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదలైంది. జిల్లా వ్యాప్తంగా అర్హులైన విద్యార్థినులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విద్యాశాఖ అధికారులు అవగాహన కల్పిస్తున్నారు.

జిల్లా వ్యాప్తంగా 8 కేజీబీవీలు

జిల్లాలోని 31 మండలాలకు గాను 8 కేజీబీవీలు ఉన్నాయి. కుప్పం నియోజకవర్గం (గుడుపల్లి, రామకుప్పం, కుప్పం, శాంతిపురం), పుంగనూరు నియోజకవర్గంలో (పుంగనూరు, రొంపిచెర్ల), పలమనేరు నియోజకవర్గంలో (గంగవరం, బైరెడ్డిపల్లిలో కేజీబీవీ పాఠశాలలున్నాయి. ఆరవ తరగతి అడ్మిషన్లకు ఒక్కో పాఠశాలలో 40 చొప్పున సీట్లు భర్తీ చేయనున్నారు. ఈ లెక్కన 320 అడ్మిషన్లు కల్పించనున్నారు. అలాగే ఇంటర్ మొదటి సంవత్సరం అడ్మిషన్లకు, మరో వైపు 7,8,9 తరగతుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు.

ఆరు నుంచి ఇంటర్ వరకు అన్నీ ఉచితమే

కేజీబీవీలో 6వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు ఉచితంగా చదువుకునే అవకాశం ఉంది. విద్యాలయాల్లో చేరిన బాలికలకు ఉచిత విద్యతో పాటు భోజనం, వసతి సౌకర్యాన్ని కల్పిస్తారు. పాఠ్య పుస్తకాలు, యూనిఫాం, కాస్మోటిక్ చార్జీలు అందజేస్తారు. రోజూ పోషక విలువలతో కూడిన రుచికరమైన భోజనం పెడతారు. ప్రత్యేక అధికారి నుంచి టీచర్లు, వాచ్‌మన్, స్వీపర్ వరకు అందరూ మహిళలే ఉంటారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా బోధన సాగుతుంది.

సద్వినియోగం చేసుకోండి



2024–25 విద్యాసంవత్సరంలో అడ్మిషన్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నాం. రాష్ట్ర ప్రభుత్వం కేజీబీవీల్లో అన్ని మౌళిక వసతులు కల్పించింది. ఈ అడ్మిషన్ల ప్రక్రియపై ఎస్ఓలు, ఎంఈఓలు, ఎంఐఎస్ కో–ఆర్డినేటర్లు, సీఆర్‌పీలు, క్షేత్రస్థాయిలో విస్తృతంగా అవగాహన కల్పించాలి. గత విద్యాసంవత్సరం కంటే అడ్మిషన్లు పెరిగేలా చర్యలు చేపట్టాలి. ఏప్రిల్ 11వ తేదీలోపు అడ్మిషన్లు చేయించేలా పకడ్బందీగా చర్యలు చేపడుతున్నాం.

– పెద్దిరెడ్డి వెంకటరమణారెడ్డి, ఏపీసీ, సమగ్రశిక్ష శాఖ, చిత్తూరు

మంచి జరిగుంటేనే ఓటేయండి

- ఈ మాట చెప్పిన ఏకైక సీఎం జగన్
- డిప్యూటీ సీఎం నారాయణ స్వామి



మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి

పాలసముద్రం : దేశ రాజకీయాల్లో ఇప్పటివరకు మీకు మంచి జరిగుంటేనే తమ పార్టీకి ఓటేయమని ప్రజలను కోరిన ఏకైక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని డిప్యూటీ సీఎం కె నారాయణస్వామి తెలిపారు. మండల కేంద్రంలో గురువారం పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతిపక్షాలన్నీ గుంపుగా వచ్చినా, ప్రజల ఆశీర్వాదంతో 2024 ఎన్నికల్లో మళ్లీ వైఎస్సార్ సీపీ విజయం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. మాయమాటలు చెప్పడానికి ప్రజల ముందుకు వచ్చిన టీడీపీ, జనసేన, బీజేపీ, కాంగ్రెస్ నాయకులకు తగిన బుద్ధి చెప్పాలన్నారు. ఎన్నికల హామీల్లో 99.5 శాతం పూర్తి చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. గత పాలకులు అమలు కానీ హామీలు ఇచ్చారని, బడ్జెట్‌లో పెట్టిన ఒక్క పని కూడా చేయకుండా, నిధులన్నీ స్వాహా చేశారని దుయ్యబట్టారు. ఇచ్చిన ప్రతి హామీ నెరవేర్చిన ఘనత కలిగిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కోసం ప్రతి ఒక్కరూ సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. 175 నియోజకవర్గాలు గెలవాలన్న సంకల్పాన్ని నెరవేర్చాలని తెలిపారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలుతో జగనన్న దేశ చరిత్రలో సుస్థిరస్థానంలో నిలిచిపోయారని పేర్కొన్నారు. ప్రజలు తమ అమూల్యమైన రెండు ఓట్లను ఫ్యాన్ గుర్తుపై వేసి జగనన్నకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. అనంతరం పార్టీ కార్యకర్తలతో కలసి వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ తులసి యాదవ్ జన్మదినం సందర్భంగా తులసి యాదవ్‌కి పూలమాల వేసి సన్మానం చేశారు. కార్యక్రమంలో బెంగళూరు పారిశ్రామిక వేత్త షణ్ముగం యాదవ్, జెడ్పీటీసీ సభ్యులు అన్బళగన్, రైతు భరోసా చైర్మన్ పోలయ్య, పెనుమూరు మార్కెటింగ్ డైరెక్టర్ రమాదేవి, ఎంపీటీసీ గోవిందరాజ్, సర్పంచ్ భాస్కర్ రెడ్డి, పుత్తూరు కేశవరెడ్డి, చంద్రశేఖర్‌రాజు, నరసింహన్, బాబు, మనోహర్, అరుల్, సుందరరాజు, షణ్ముగరెడ్డి, ఆనంద్, గోవిందరాజు, రవిరెడ్డి, సుమన్, ధనంజయరెడ్డి, సుబ్రమణ్యం రెడ్డి, చిన్నబ్బ రాజు, తిరుమల, ఢిల్లీ, విష్ణు, గోపాల్, సిద్దమండడి, వరదరాజు, తదితరులు పాల్గొన్నారు.

• కృష్ణకటాక్షం



తిరుమలలో శ్రీవారి వార్షిక తెప్పోత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. రెండో రోజు గురువారం స్వామి వారు రుక్మిణీ సమేత శ్రీకృష్ణస్వామి అలంకరణలో తెప్పపై ఊరేగుతూ భక్తులకు కనువిందు చేశారు. ఈవో ఏవీ ధర్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

– తిరుమల



ఉద్యోగులం కాదు.. ఇక జగనన్న సైనికులం



ఈవోపీఆర్‌డీకి రాజీనామా పత్రాలను అందిస్తున్న వలంటీర్లు

గుడుపల్లె : ''మేము ఉద్యోగులం కాదు.. ఇక నుంచి జగనన్న సైనికులం.'' అంటూ వలంటీర్లు ఒక ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ గురువారం సామూహిక రాజీనామాలు చేశారు. ఉద్యోగం కంటే జగనన్న కోసం ప్రచారం చేయడమే ముఖ్యమని స్పష్టం చేశారు. ఈ మేరకు ఈఓపీఆర్‌డీ శంకర్‌కు రాజీనామా పత్రాలను అందించారు. మండలంలో కుప్పిగానిపల్లె గ్రామ పంచాయతీకి చెందిన 14 మంది వలంటీర్లు, శెట్టిపల్లె గ్రామ పంచాయతీకి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ మునెప్ప రాజీనామాలు చేశారు. ఎన్నికల నిబంధనల మేరకు ఎన్నికల కోడ్‌ను గౌరవిస్తూ రాజీనామా చేసినట్లు వారు వెల్లడించారు. ఎన్నికల్లో ప్రచారం చేయడం కోసం ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి మరోసారి జగనన్నను సీఎం చేసుకుంటామని వారు స్పష్టం చేశారు.

మూల్యాంకన కేంద్రంలో వసతులు కల్పించాలి


దీఈఓకు వినతిపత్రం అందజేస్తున్న యూటీఎఫ్ నేతలు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేయనున్న పదవ తరగతి మూల్యాంకన కేంద్రంలో అన్ని వసతులను కల్పించాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జీవీ రమణ కోరారు. ఈ మేరకు ఆ సంఘం నాయకులు గురువారం డీఈఓ దేవరాజుకు వినతిపత్రం అందజేశారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని పది పరీక్షల మూల్యాంకన కేంద్రంలో పకడ్బందీగా వసతులు చేపట్టాలని కోరారు. అనంతరం టీచర్ల పలు సమస్యలను ఆ సంఘ నాయకులు డీఈఓ దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మణికంఠం, గౌరవాధ్యక్షులు సుధాకర్‌రెడ్డి, సహాధ్యక్షులు రెహానాబేగం, తదితరులు పాల్గొన్నారు.

సంతానం లేదని మహిళ బలవన్మరణం

ఐరాల: పిల్లలు పుట్టలేదని వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని చుక్కావారిపల్లిలో గురువారం చోటుచేసుకుంది. ఎస్ఐ రమేష్‌బాబు కథనం మేరకు, చుక్కావారిపల్లెకు చెందిన మదన్‌మోహన్, సోమల మండలం గట్టువారిపల్లెకు చెందిన నాగలక్ష్మి(21)కి మూడేళ్ల క్రితం వివాహమైంది. పిల్లలు పుట్టలేదని భర్త వేధిస్తుండడంతో మనస్తాపానికి గురైన నాగలక్ష్మి గురువారం ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నాగలక్ష్మి తండ్రి నాగరాజు అల్లుడు అదనపు కట్నం కోసం వేధించి హత్య చేశారని ఆరోపించడం గమనార్హం.

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థుల ప్రకటన స్థానిక నేతల్లో చిచ్చు రాజేసింది. రోజురోజుకీ అసమ్మతి రాగం సెగలు పుట్టిస్తోంది. అభ్యర్థుల ప్రకటన నిర్ణయాన్ని మరోసారి పునరాలోచించాలన్న నినాదం మిన్నంటుతోంది. అసమ్మతి నేతలంతా రహస్య సమావేశాలు.. ఎత్తుకుపైఎత్తులు వేయడం సర్వత్రా చర్చనీయాంశమైంది. బొజ్జలకు సహకరించేది లేదని శ్రీకాళహస్తి నేతలు భీష్మించుకోగా.. టికెట్ కమలనాథుల దేనని అక్కడి నేతలు ప్రకటించుకోవడం ఆసక్తికరంగా మారింది. తిరుపతిలో లోకల్ నాన్ లోకల్ వివాదం తెరపైకి రాగా.. మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ అభ్యర్థనను చినబాబు తిరస్కరించి ఛీవాట్లు పెట్టడం ఇప్పుడు ఇక్కడ హాట్‌టాపిక్‌గా మారింది. సత్యవేడులో రెబల్ అభ్యర్థుల ప్రచారం నేపథ్యంలో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిని ప్రచారం చేయొద్దంటూ లోకేష్ ఆదేశించడం ఆయన వర్గీయులను విస్మయానికి గురిచేసింది. వెంకటగిరిలో టీడీపీకి సహకరించేది లేదని మస్తాన్ యాదవ్ వర్గం ప్రకటించడం ఎమ్మెల్యే అభ్యర్థి నోట్లో వెలక్కాయపడ్డట్టయ్యింది.

సీట్ల చిచ్చు



- శ్రీకాళహస్తిలో బొజ్జల వద్దేవద్దంటున్న కూటమి నేతలు
- తిరుపతిలో మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మకు లోకేష్ వార్నింగ్
- నాగబాబు వద్దకు చేరిన తిరుపతి జనసేన నేతల పంచాయితీ
- వెంకటగిరిలో చంద్రబాబు నిర్ణయంపై భగ్గుమంటున్న బీసీ నేతలు
- సత్యవేడులో ఆదిమూలానికి షాక్.. కొన్నాళ్లు ప్రచారం చేయొద్దన్న లోకేష్

సాక్షి, తిరుపతి: కూటమిలో సీట్లు చిచ్చు రాజుకుంది. అభ్యర్థుల ప్రకటన తర్వాత ఆశావహుల ధిక్కారస్వరం శ్రుతి మించుతోంది. టీడీపీ అధినేత చంద్రబాబుకు తన సొంత జిల్లాలో అసమ్మతి సెగ పెద్ద సవాలుగా మారింది. పొత్తులో భాగంగా తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో ఉమ్మడి అభ్యర్థులను ప్రకటించిన విషయం తెలిసిందే. తిరుపతి, శ్రీకాళహస్తి, సత్యవేడు, వెంకటగిరిలో ఆయా అభ్యర్థులను బాహాటకంగా స్థానిక నేతలు వ్యతిరేకిస్తున్నారు. తిరుపతి అసెంబ్లీ సీటుని ఉమ్మడి అభ్యర్థి జనసేనకు కేటాయించగా.. మిగిలిన నియోజకవర్గాల్లో టీడీపీ పోటీ చేస్తోంది.

సత్యవేడు మార్చాల్సిందే..

సత్యవేడులో అభ్యర్థి ఆదిమూలాన్ని మార్చకపోతే తాము సహకరించేది లేదని టీడీపీ నేతల ఆందోళనలు చేస్తున్న విషయం తెలిసిందే. టీడీపీ నాయకుడు జేడీ రాజశేఖర్ రెబల్ అభ్యర్థిగా ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ పరిస్థితుల్లో తిరుపతికి వచ్చిన లోకేష్‌ని ఆదిమూలం కలిశారు. ప్రస్తుత పరిస్థితుల్లో కొన్నాళ్ల పాటు ఎటువంటి ప్రచారాలు చేయొద్దంటూ లోకేష్ ఆదేశించినట్లు విశ్వసనీయ సమాచారం. లోకేష్ మాటలతో షాక్‌కి గురైన ఆదిమూలం తన అనుచరులతో సమావేశమైనట్లు తెలిసింది. టీడీపీ నేతల సమాచారం మేరకు.. మాజీ ఎమ్మెల్యే తలారి ఆదిత్య అధిష్టానంపై తీవ్ర స్థాయిలో ఒత్తిడి చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. నేటి నుంచి సత్యవేడులో అభ్యర్థుల ఎంపికపై రీసర్వే చేపట్టనున్నట్లు సమాచారం. మరో వైపు మాజీ ఎమ్మెల్యే హేమలత చంద్రబాబు తీరుపై అసంతృప్తితో ఉన్నట్లు సమాచారం.

సహకరించేదే లేదు..

వెంకటగిరిలో టీడీపీ నాయకుడు మస్తాన్ యాదవ్ అనుచరులు చంద్రబాబు ప్రకటించిన అభ్యర్థికి సహకరించేది లేదని మరోసారి ప్రకటించారు. ఆ మేరకు మస్తాన్ యాదవ్ అనుచరులు సమావేశంలో చర్చించి అధిష్టానానికి తమ నిర్ణయాన్ని పంపించారు.

ఇది 'సుగుణ'ం కాదు..

తిరుపతి స్థానిక నాయకులు లోకల్ నాన్ లోకల్ ఫీలింగ్ తీసుకురావడంతో చిచ్చు మరింతగా రాజుకుంది. తిరుమల దర్శనార్థం వచ్చిన లోకేష్ ఎదుట తిరుపతి టీడీపీ నేతలు తమ గోడును వెళ్లబుచ్చుకున్నారు. అభ్యర్థిని మార్చే ప్రశక్తే లేదని తేల్చిచెప్పడంతో పాటు మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మకు వార్నింగ్ కూడా ఇచ్చినట్లు విశ్వసనీయ సమాచారం. 'మీరు ఎన్ని డ్రామాలు చేస్తున్నా.. అధిష్టానం అన్నీ గమనిస్తూనే ఉంది' అంటూ హెచ్చరికలు జారీచేసి టీడీపీ శ్రేణులను తీవ్రంగా అవమానించారు. ఇదిలా ఉంటే.. తిరుపతిలో 50 డివిజన్ల అధ్యక్షులను మార్చాలంటూ జనసేన అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు పట్టుబడుతున్నారు. తాను అభ్యర్థి అయినప్పుడు తనకు అనుకూలంగా ఉన్న వారిని నియమించుకుంటానని స్పష్టం చేసినట్లు తెలిసింది. అయితే స్థానిక జనసేన నాయకులు కిరణ్‌రాయల్, మరికొందరు ఆరణి శ్రీనివాసులు నిర్ణయాన్ని తప్పుబడుతున్నారు. దీంతో తిరుపతి పంచాయితీ గురువారం రాత్రి నాగబాబు వద్దకు చేరింది.

బొజ్జల వద్దే వద్దు

శ్రీకాళహస్తి నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడు, జనసేన ఇన్‌చార్జ్ వినుత, బీజేపీ నేతలు కలిసి గురువారం రహస్య సమావేశం ఏర్పాటు చేశారు. అధిష్టానం ఒంటెద్దు పోకడలకుపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. బొజ్జల సుధీర్‌కి ఇస్తే పనిసే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. రాజకీయాల్లో చివరి దశలో ఉన్న తనకు అవకాశం ఇవ్వాలని, కమ్మ సామాజికవర్గానికి న్యాయం చేయాలని ఎస్సీవీ నాయుడు అధిష్టానంపై ఒత్తిడి తెస్తున్నారు. ఎవరికి వారు రెబల్ అభ్యర్థులుగా బరిలో ఉంటామని హెచ్చరిస్తున్నారు. మరోవైపు శ్రీకాళహస్తి టికెట్ బీజేపీకి కేటాయించాలని కమలనాథులు చంద్రబాబుపై ఒత్తిడి చేస్తున్నట్లు సమాచారం. అందులో భాగంగా కోలా ఆనంద్ గత కొద్దిరోజులుగా ఢిల్లీకే పరిమితమయ్యారు.


శ్రీకాళహస్తిలో సమావేశం అయిన టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు

ప్రమాదవశాత్తు మహిళ మృతి

బైరెడ్డిపల్లె : మండలంలోని కామినేపల్లె గ్రామ సమీపంలో ఉన్న చెరువు గుంతలో పడి ఓ మహిళ మృతి చెందిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. కొత్తయిండ్లు గ్రామానికి చెందిన శాంతమ్మ (55) కామినేపల్లె చెరువులో రహదారి నిర్మాణం కోసం మట్టి తీసిన గుంతలో ప్రమాదవశాత్తు కాలిజారి పడి మృతి చెందింది. శాంతమ్మ భర్త మృతి చెందగా పిల్లలు ఎవరూ లేకపోవడంతో ఒంటరిగా జీవనం సాగిస్తోంది. అయితే దీనిపై పోలీసులకు ఎలాంటి సమాచారం అందలేదు. బంధువులు దహనక్రియలు చేశారు.

వలంటీర్ తొలగింపు

చిత్తూరు కలెక్టరేట్ : మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌కు వ్యతిరేకంగా ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న వలంటీర్ రోహిత్‌ను తొలగించినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షణ్మోహన్ గురువారం ప్రకటనలో పేర్కొన్నారు. ఎంసీఎంసీ కమిటీ విచారణ చేసిన అనంతరం గుడిపాల మండలం రామభద్రాపురం క్లస్టర్ -5 వలంటీర్ రోహిత్‌ను విధుల నుంచి తప్పించినట్లు జిల్లా ఎన్నికల అధికారి తెలిపారు.

పీఈఎస్‌లో అరుదైన కీ హోల్ శస్త్ర చికిత్స

గుడుపల్లె: కుప్పంలోని పీఈఎస్ ఆస్పత్రిలో జయమ్మకు వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా అరుదైన కీ హోల్ శస్త్ర చికిత్స నిర్వహించి ప్రాణాలను కాపాడారని ఆస్పత్రి సూపరింటెండెంట్ సుబ్రమణ్యం తెలిపారు. పీఈఎస్‌లో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. మండలంలోని ఆవుల చెరువు గ్రామానికి చెందిన జయమ్మ ఈ నెల 13వ తేదీన మూర్ఛవ్యాధితో ఆస్పత్రిలో అడ్మిట్ ఆయ్యారు. న్యూరో వైద్యులు మయూర్ వినయ్ కుమార్ ఆమెకు పరీక్షలు నిర్వహించారు. జయమ్మకు మెదడు దగ్గర పెద్ద బంతి సైజు కణితి ఉండడంతో వెంటనే ఐసీయూకి తరలించారు. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా ఆమెకు కీ హోల్ శస్త్ర చికిత్సను 7 గంటల్లో పూర్తి చేశారు. సాధారణంగా ఈ శస్త్ర చికిత్సకు 14 గంటలు పడుతుందన్నారు. కానీ కీ హోల్ సర్జరీ ద్వారా తక్కువ కాలంలో మెరుగైన వైద్యం అందించడంతో ఆమె త్వరగా కోలుకుంటోందన్నారు.

సర్పంచ్ కుటుంబంపై టీడీపీ దాడి

యాదమరి: మండలంలోని మాదిరెడ్డిపల్లె సర్పంచ్ మహాలక్ష్మి కుటుంబంపై టీడీపీ నాయకులు గురువారం రాత్రి దాడి చేశారు. టీడీపీ అభ్యర్థి మురళీ మోహన్ మాదిరెడ్డిపల్లె పంచాయతీ గ్రామాల్లో గురువారం సాయంత్రం ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచార కార్యక్రమానికి మాదిరెడ్డిపల్లె సర్పంచ్, కుటుంబ సభ్యులు రాలేదని టీడీపీ ఎంపీటీసీ సభ్యుడు విజేయంద్రవర్మ వారి వర్గం దాడి చేసింది. దీనిపై సర్పంచ్ ఫిర్యాదు మేరకు యాదమరి పోలీసులు తొమ్మిది మందిపై కేసు నమోదు చేశారు.

టీడీపీ నేత కారులో అక్రమంగా మద్యం తరలింపు


పోలీసులు సీజ్ చేసిన కారు

చౌడేపల్లె: టీడీపీ నాయకుడు సోమల నగేష్‌కు చెందిన కారులో అక్రమంగా తరలిస్తున్న డిఫెన్స్ మద్యం స్వాధీనం చేసుకున్న సంఘటన బుధవారం రాత్రి మండలంలో వెలుగుచూసింది. ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి గురువారం తెలిపిన వివరాల మేరకు, పలమనేరు మార్గంలోని శెట్టిపేట కూడలిలో పోలీసు సిబ్బందితో కలిసి వాహనాలను తనిఖీ చేస్తుండగా సోమల నగేష్ ప్రయాణిస్తున్న కారులో డిఫెన్స్‌కు చెందిన మద్యం బాటిళ్లు గుర్తించామన్నారు. దానికి సంబంధించిన ఎలాంటి బిల్లులు లేకపోవడంతో కారును సీజ్ చేసి, వారిద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

వరకట్న వేధింపులతో వివాహిత ఆత్మహత్య


ధరణి (ఫైల్)

పలమనేరు: వరకట్న వేధింపుతలతో వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన పలమనేరు పట్టణంలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. పట్టణంలోని పల్లె వీధికి చెందిన శ్రీనివాసులుతో ధరణి(32)కి 14 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరి పెళ్లికి భారీగానే కట్నకానుకలనిచ్చారు. వీరికి ఇద్దరు మగపిల్లలున్నారు. ఇటీవల భర్త, అత్తమామల వరకట్న వేధింపులతో ధరణి పట్టణంలోనే ముత్తాచారిపాళెంలో ఉన్న పుట్టింటికి చేరింది. దీనిపై పంచాయతీ చేసిన పెద్దలు భర్తతో కాపురానికి పంపాలని చేసిన ప్రయత్నాలు బెడిసికొట్టాయి. దీంతో మనస్థాపానికి గురైన ధరణి పుట్టినింటిలోనే ఒంటిపై కిరోసిన్ పోసుకొని నిప్పు పెట్టుకుంది. స్థానికులు ఆమెను పట్టణంలోని ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ ఆమె మృతి చెందింది. దీనిపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి విచారిస్తున్నారు

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం


మృతుడు (ఫైల్)

పూతలపట్టు: రైలు పట్టాలపై గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. చిత్తూరు రైల్వే పోలీసుల కథనం మేరకు బుధవారం చిత్తూరు – పూతలపట్టు మధ్య రైలు పట్టాలపై గుర్తు తెలియని మృతదేహం ఉన్నట్లు రైల్వే పోలీసులు గుర్తించారు. మృతుని వయసు 25 ఏళ్లు ఉంటుందని తెలిపారు. మృతుడు చనిపోయే ముందు లేతపచ్చ రంగు చొక్కా, పసుపు రంగు ప్యాంట్ ధరించినట్లు తెలిపారు. ప్రస్తుతం మృతదేహం చిత్తూరు ప్రభుత్వాసుపత్రి మార్చురీలో ఉంచినట్లు తెలిపారు. మృతుని ఆచూకీ తెలిస్తే 94406 27652ను సంప్రదించాలని కోరారు.

బైక్‌పై నుంచి పడి వ్యక్తి దుర్మరణం


మృతి చెందిన రామన్

తవణంపల్లె: బైక్‌పై అతివేగంగా వచ్చి డివైడర్‌ను ఢీకొన్న సంఘటనలో వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని పట్నం సమీపంలో చోటుచేసుకుంది. ఎస్ఐ సుధాకర్ రెడ్డి కథనం మేరకు, చిత్తూరు నగరం కట్టమంచి కన్నికలమ్మ గుడి వీధికి చెందిన ఆర్.రామన్(60) తిరుపతి– బెంగుళూరు హైవే పక్కన ఆటో ఎలక్ట్రికల్ షాపులో మెకానిక్‌గా పని చేస్తున్నాడు. కాణిపాకానికి ద్విచక్ర వాహనంపై వెళుతుండగా అదుపుతప్పి కింద పడి డివైడర్‌ను ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని భార్య రేణుక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు వివరించారు.

అదుపుతప్పి కారు బోల్తా


కాటప్పగారిపల్లె వద్ద బోల్తాపడిన కారు

బంగారుపాళెం: మండలంలోని కాట్టప్పగారిపల్లె వద్ద చెన్నై–బెంగళూరు జాతీయ రహదారిపై గురువారం రాత్రి కారు అదుపుతప్పి బోల్తాపడింది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. బెంగళూరులోని రాజేంద్ర నగర్‌కు చెందిన నంద మిత్రులు నిరంజన్, అభిజిత్ కారులో తిరుపతికి బయల్దేరారు. మార్గమధ్యంలో కాటప్పగారిపల్లె వద్ద రోడ్డు పక్కనుంచి ద్విచక్ర వాహనం అడ్డురావడంతో తప్పించబోయి ముందు వెళుతున్న మరో ద్విచక్ర వాహనాన్ని ఢీకొని రహదారి పక్కన బోల్తాపడింది. ఈ ప్రమాదంలో మల్లేశ్వరం గ్రామానికి చెందిన ధరణి గాయపడ్డాడు. కారులో ప్రయాణిస్తున్న అభిజిత్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


అవమానం భరించలేకున్నా..!


పోలీస్ స్టేషన్ వద్ద శవంతో ధర్నా చేస్తున్న మృతుని బంధువులు (ఇన్‌సెట్) చంద్రశేఖర్ (ఫైల్)

వెదురుకుప్పం: 'పోలీసుల దురుసు ప్రవర్తన నన్ను కలచి వేసింది..ఈ అవమానం భరించలేను..నేను చనిపోతున్నా'. అంటూ కన్న కుమార్తె, అల్లుడికి చెప్పి భావోద్వేగంతో ఓ రైతు తనువు చాలించాడు. దీంతో ఎస్ఐని వీఆర్‌కు బదిలీ, కానిస్టేబుల్, హోంగార్డును సస్పెండ్ చేశారు.

స్థానికుల కథనం మేరకు, మండలంలోని మర్రిమాకులకండ్రిగ గ్రామానికి చెందిన అన్నదమ్ములు దేశయ్య, ఎం.చంద్రశేఖర్(58)కు వారసత్వ భూములు ఉన్నాయి. అయితే భాగ పరిష్కారానికి ఇద్దరూ అంగీకరించకపోవడంతో వివాదం ముదిరి తరచూ గొడవలు చోటుచేసుకోవడంతో వారు పోలీస్ స్టేషన్ చుట్టూ తిరుగుతున్నారు. ఈ క్రమంలో దేశయ్య భార్య శారదమ్మ గురువారం ఉదయం పొలం పనులకు వెళ్లింది. గమనించిన చంద్రశేఖర్ ఆమెను పొలంలోకి రానివ్వకుండా అడ్డుకోవడంతో వెంటనే వెదురుకుప్పం పోలీసులను ఆశ్రయించింది. పోలీసుల సాయంతో శారదమ్మ పొలం వద్దకు వెళ్లగా అక్కడే ఉన్న చంద్రశేఖర్‌పై దురుసుగా వ్యవహరించి అతనిపై చేయి చేసుకున్నారని తెలిపారు. ఇంతటితో ఆగకుండా స్టేషన్ వద్దకు తీసుకెళ్లి మందలించడంతో చంద్రశేఖర్ మనస్తాపానికి గురయ్యాడు. ఇంటికి వచ్చిన చంద్రశేఖర్ తిరుపతిలో ఉన్న కుమార్తె, అల్లుడితో ఫోన్‌లో మాట్లాడాడు. ‘పోలీసులు చేసిన అవమానాన్ని భరించలేకపోతున్నాను..నేను చచ్చిపోతున్నాను,’’ అంటూ పురుగుల మందు తీసుకున్నాడు. గమనించిన స్థానికులు వెంటనే చంద్రశేఖర్‌ను పచ్చికాపల్లం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం తిరుపతికి తరలిస్తుండగా ఎర్రగుంట వద్ద మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. చంద్రశేఖర్ మృతి చెందినట్లు తెలియడంతో మర్రిమాకులకండ్రిగ గ్రామస్తులు చంద్రశేఖర్ శవాన్ని తీసుకెళ్లి వెదురుకుప్పం పోలీస్ స్టేషన్ వద్ద ఉంచి ఆందోళన చేపట్టారు. మహిళలు పెద్ద ఎత్తున ధర్నా చేశారు. పోలీసుల వైఖరే చంద్రశేఖర్ మరణానికి కారణం అని నినదించారు. సమాచారం అందుకున్న నగరి డీఎస్పీ కేఎస్ మూర్తి కార్వేటినగరం సత్యబాబు, ఎస్ఐలు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. భూతగాదాల కారణంగా ఆత్మహత్య చేసుకున్న కుటుంబానికి న్యాయం చేస్తామని నగరి డీఎస్పీ మూర్తి చెప్పారు. ఆత్మహత్యకు కారకులపై కఠిన చర్యలు తీసుకుంటామని బాధితులకు హామీ ఇచ్చారు. ఎస్ఐ వెంకటేశ్వర్లను వీఆర్‌కు బదిలీ చేసినట్లు ఉత్తర్వులు వచ్చాయి. ఒక కానిస్టేబుల్, హోంగార్డుపై సస్పెన్షన్ వేటు పడినట్లు సమాచారం. మృతదేహాన్ని పుత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు వివరించారు.

కోడ్ బేఖాతర్.. యథేచ్ఛగా ఇసుక తరలింపు


కౌండిన్య నదిలో ఇసుకను తవ్వుతున్న జేసీబీ

పలమనేరు: ఎన్నికల కోడ్ వచ్చాక పలమనేరు మండలంలో ఇసుక అక్రమ రవాణా ఊపందుకుంది. ఎన్నికలకు సంబంధించిన విధుల్లో అన్ని శాఖల అధికారులు, పోలీసులు నిమగ్నమయ్యారు. ఇదే అదునుగా కొందరు ఇసుకాసురులు లోడ్ల సంఖ్యను పెంచేశారు. పట్టణ సమీపంలోని కౌండిన్య నదిలో చెక్‌డ్యామ్‌ల వద్ద నీళ్లున్నప్పటికీ జేసీబీ వాహనాలతో నీటిలోని ఇసుకను తోడేసి, ట్రాక్టర్లకు వేసి తరలించేస్తున్నారు. కన్నమాకుపల్లి– చిన్నపేట కురప్పల్లి, క్యాటిల్‌ఫామ్ తదితర ప్రాంతాల నుంచి ఉదయం 9 నుంచి సాయంత్రం వరకూ పట్టపగలే ఇసుక ట్రాక్టర్లు రహదారిపై పరుగులు తీస్తున్నాయి. అయినా సంబంధిత శాఖ అధికారులు ఇసుక ట్రాక్టర్లను చూసినా పట్టించుకోకపోవడం విచారకరం.